# కాంగ్రెస్ హయాంలో అభివృద్ధి శూన్యం

- బైపాస్ రోడ్డు, విస్తరణ పనులు చేపట్టాలి
- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు గట్టుయాదవ్



వినతిపత్రం అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

వనపర్తి, జూన్ 25: కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అభివృద్ధి పనులు ముందుకు సాగడంలేదని, ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా ఉన్నాయని బీఆర్ఎస్ అధ్యక్షుడు గట్టుయాదవ్ ఎద్దేవా చేశారు. మంగళవారం పట్టణంలో ప్రభుత్వ హయాంలో ప్రారంభించి నిలిచిన బైపాస్ రోడ్డు, విస్తరణ పనులను వెంటనే ప్రారంభించాలని కోరుతూ.. బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు రమేశ్‌గౌడ్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు ఆర్ అండ్‌బీ అధికారి సీతారామస్వామికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పట్టణాభివృద్ధి కోసం గత ప్రభుత్వ హయాంలో మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా నిధులు తీసుకొచ్చి రోడ్డు విస్తరణ పనులు 90శాతం పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి 7 నెలలు కావొస్తున్నా నేటికి 10శాతం పనులు చేపట్టలేకపోయిందని విమర్శించారు. పట్టణంలో 9 కిలోమీటర్ల మేర పెబ్బేరు రోడ్డు, పానగల్ రోడ్డు విస్తరణ, పాలిటెక్నిక్ కళాశాల నుంచి రామాలయం వరకు రోడ్డు విస్తరణ, ఔటర్ రింగ్ రోడ్డు పనులను చేపట్టాలని కోరారు. నియోజకవర్గ వ్యాప్తంగా మంజూరై నిలిచిపోయిన పనుల గురించి ఇటీవలనే మాజీ మంత్రి కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారని గుర్తుచేశారు. కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్, మీడియా కన్వీనర్ అశోక్, కౌన్సిలర్లు బండారు కృష్ణ, కంచెరవి, నాయకులు తిరుమల్, ప్రేమ్‌నాథ్‌రెడ్డి, రహీం, జాత్రునాయక్, నీలస్వామి తదితరులు పాల్గొన్నారు.

# వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలి

- వనపర్తి కలెక్టర్ ఆదర్శ్ సురభి



వీసీలో పాల్గొన్న కలెక్టర్ ఆదర్శ్ సురభి ,అధికారులు

వనపర్తి, జూన్ 25: జిల్లాలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా నివారణ చర్యలను పకడ్బందీగా చేపట్టాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో మున్సిపల్ కమిషనర్లు, రోడ్డు భవనాలు, మిషన్ భగీరథ అధికారులతో సీజనల్ వ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. వర్షాకాలంలో దోమలు పెరిగి డెంగీ, మలేరియా, చికున్ గున్యా, టైఫాయిడ్, డయేరియా ప్రబలకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. మున్సిపల్ కమిషనర్లు క్షేత్రస్థాయిలో పర్యటించి పారిశుధ్య పనులు, ప్రతి శుక్రవారం నిర్వ హించే డ్రై డే కార్యక్రమాలను దగ్గరుండి పర్యవేక్షించాలన్నారు. ప్రతి ఇంటి నుంచి చెత్త సేకరణ పకడ్బందీగా జరగాలని, రోడ్డుపై ఎక్కడైనా గుంతలు తవ్వి ఉంటే చుట్టూ బారికేడ్ ఏర్పాటు చేయాలన్నారు. నెలలో మూడుసార్లు తప్పకుండా ఓవర్ హెడ్ ట్యాంక్‌లు శుభ్రం చేయించాలని, లాగ్‌బుక్ పెట్టి శుభ్రం చేసిన తేదీ, వారి సంతకం ఉండాలన్నారు. ప్రతి శుక్రవారం నిర్వహించే డ్రైడేపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. అంగన్‌వాడీ, ఆశవర్కర్లను భాగస్వాములను చేయాలన్నారు. ప్రతివార్డుకు ప్రత్యేక అధికారిని నియమించి పర్యవేక్షణ చేయించాలన్నారు. పట్టణాల్లోని పలు కూడళ్లలో ఫ్లెక్సీలు పెట్టిన వారినుంచి రుసుము వసూలు చేయాలన్నారు. జిల్లాలోని రెస్టారెంట్లు, హోటళ్లలో తనిఖీలు చేయాలని, ఆహార పదార్థాలు, కూరగాయల నాణ్యతను పరిశీలించాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్, రోడ్డు భవనాల కార్యనిర్వాహక ఇంజినీర్ దేశ్యానాయక్, మిషన్ భగీరథ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు తదితరులు పాల్గొన్నారు.

### అంగన్‌వాడీ కేంద్రాలపై నివేదిక అందించాలి



రక్త పరీక్ష చేయించుకుంటున్న కలెక్టర్

అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక వసతుల స్థితిగతులపై నివేదిక ఇవ్వాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి అధికారులను ఆదేశించారు. మంగళవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమశాఖ ప్రత్యేక కార్యదర్శి వాకాటి కరుణ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు, శ్యాం-మ్యాం పిల్లల నివేదిక, సదరం క్యాంపుల ఏర్పాటు, వృద్ధుల మెయింటెనెన్స్, ట్రాన్స్‌జెండర్ల సాధికారతపై సమీక్ష నిర్వహించారు. అలాగే అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక వసతులతోపాటు పెయింటింగ్ బొమ్మలు వేయించాలని సూచించారు. శ్యాం, మ్యాం పిల్లల గుర్తింపు నివేదిక ఇవ్వాలని సూచించారు. ట్రాన్స్‌జెండర్ల సాధికారత, సదరం క్యాంపు నిర్వహణ విధివిధానాలను పవర్ పాయింట్ ద్వారా వివరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. అంగన్‌వాడీల నిర్వహణపై వాస్తవిక నివేదిక ఇవ్వాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో జయచంద్రమోహన్, జిల్లా సంక్షేమ అధికారిని లక్ష్మి, సీడీపీవోలు ,సూపర్‌వైజర్లు తదిత రులు పాల్గొన్నారు.

### వైద్యసిబ్బంది అందుబాటులో ఉండాలి

పెద్దమందడి, జూన్ 25: గ్రామీణ ప్రజలకు వైద్యులు, సిబ్బంది ఎల్లవేళలా అందుబాటులో ఉండాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. మంగళవారం మండల కేంద్రంలోని పీహెచ్‌సీని సందర్శించారు. ముందుగా కేంద్రంలోని రికార్డులను పరిశీలించి, రోగుల సంఖ్యను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా ఫార్మసీ స్టోర్, మందుల నిల్వలు, ల్యాబ్‌లో చేస్తున్న పరీక్షలపై ఆరా తీశారు. స్వయంగా కలెక్టర్ ల్యాబ్‌లో రక్త పరీక్ష చేయించుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ల్యాబ్‌లో చేస్తున్న పరీక్షల రిపోర్ట్స్‌ను సకాలంలో అందించాలన్నారు. ఏఎన్ఎంలు, ఆశాలతో తరుచూ సమావేశాలు నిర్వహించి గ్రామాల్లో నెలకొన్న ఆరోగ్య సమస్యలను తెలుసుకోవాలని వైద్యాధికారులను ఆదేశించారు. అలాగే తాసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి ధరణి రిజిస్ట్రేషన్ ప్రక్రియను పరిశీలించారు. అనంతరం అధికారులతో సమావేశమై ధరణిలో వచ్చే దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో డీటీ చక్రపాణి, ఎంపీడీవో, వైద్యులు, సిబ్బంది, ఇతర శాఖ అధికారులు ఉన్నారు.

# ప్రకృతివనాలను సుందరంగా తీర్చిదిద్దాలి

- అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్



కిష్టాపూర్‌లో రికార్డులను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్

పాన్‌గల్, జూన్ 25: గ్రామాల్లోని ప్రకృతి వనాలను సుందరంగా తీర్చిదిద్దాలని అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్ అన్నారు. మంగళవారం మండలంలోని కిష్టాపూర్ తండా, కదిరేపాడులో సందర్శించి నర్సరీలు, సెగ్రిగేషన్ షెడ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రకృతి వనంలో అన్నిరకాల మొక్కలు ఉండాలని, సెగ్రిగేషన్ షెడ్లను సద్వినియోగం చేసుకొని సేంద్రియ ఎరువులు తయారు చేసుకోవాలని పేర్కొన్నారు. అనంతరం ఆయా పంచాయతీల్లో రికార్డులను పరిశీలించారు. సంపూర్ణ పారిశుధ్యంలో ప్రజలను భాగస్వాములను చేయాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీవో కోటేశ్వర్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

# ప్రతి రైతుకూ 'భరోసా' అమలు చేయాలి

- వీసీలో రైతుల అభిప్రాయం వెల్లడి
- విజ్ఞప్తులను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం: ఏడీఏ సక్రియా నాయక్

అయిజ, జూన్ 25 : ప్రతి రైతుకూ రైతు భరోసా అమలు చేయాలని అన్నదాతలు కోరారు. ఎలాంటి షరతులు లేకుండా రైతులందరికీ పంట పెట్టుబడి కింద రైతు భరోసా అమలు చేస్తే ఉపయోగకరంగా ఉంటుందని అభిప్రాయం వ్యక్తం చేశారు. మంగళవారం పట్టణంలోని రైతువేదికలో నిర్వహించిన వీసీలో రైతులు, అలంపూర్ నియోజకవర్గ పరిధిలోని వ్యవసాయాధికారులు పాల్గొన్నారు. హైదరాబాద్ నుంచి వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, ప్రిన్సిపల్ సెక్రటరీ రఘునందన్‌రావు, డైరెక్టర్ గోపి రైతు భరోసాపై రైతుల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. రాష్ట్రంలోని రైతులందరి అభిప్రాయాలు తెలుసుకుని రైతు భరోసా ఏరకంగా అమలు చేయాలో ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళ్తామని మంత్రి వెల్లడించారు.

- ⇨ పంటలు సాగుచేస్తున్న భూములన్నింటికీ రైతు భరోసా అమలు చేయాలి
- ⇨ రైతులకు ఎంత భూమి ఉన్నా పదెకరాల వరకు రైతు భరోసా వర్తింపజేయాలి.

ప్రస్తుత తరుణంలో పంటల సాగు అధిక పెట్టుబడులు పెట్టాల్సి వస్తుందని, ప్రభుత్వం రైతు భరోసా తక్షణమే ఇచ్చి రైతులను ఆదుకోవాలని రైతులు కోరారు. కేసీఆర్ హయాంలో మాదిరిగా పంటల సాగుకు ముందుగానే పెట్టుబడి అందజేస్తే బాగుంటుందని రైతులు అధికారులకు విన్నవించారు. రైతులు సూచించి సూచనలు, అభిప్రాయాలను ఉన్నతాధికారులు, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని ఏడీఏ సక్రియా నాయక్ తెలిపారు. సమావేశంలో ఏవోలు శంకర్‌లాల్, చంద్రశేఖర్, రాధ, సుబ్బారెడ్డి, సురేఖ, అనిత, అయూబ్, ఏఈవోలు పాల్గొన్నారు.



అయిజ : పట్టణంలోని రైతు వేదికలో నిర్వహించిన వీసీలో పాల్గొన్న ఏవోలు, రైతులు

### ఆధునిక పద్ధతులు అనుసరించాలి

పాన్‌గల్, జూన్ 25: ఆధునిక వ్యవసాయ పద్ధతులను అనుసరించి రైతులు అధిక దిగుబడులు పొందాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, ప్రణాళికా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి అన్నారు. రైతు భరోసా పథకం అమలు చేయడానికి రైతుల నుంచి అభిప్రాయాలు, సలహాలు అడిగేందుకు రైతువేదికల్లో వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు.



పాన్‌గల్ రైతువేదికలో వీసీకి హాజరైన రైతులు

ఈ సందర్భంగా రైతు భరోసాపై వస్తున్న అపోహలను నివృత్తి చేశారు. రైతుభరోసా పథకాన్ని అమలు చేయడానికి రైతుల అభిప్రాయాలు, సలహాలను అడిగి తెలుసుకున్నారు. అలాగే రైతులనుంచి దరఖాస్తుల రూపంలో స్వీకరించారు. రైతు నేస్తం కార్యక్రమాన్ని అధికారులు మొక్కుబడిగా కొనసాగించారు. వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ మల్లారెడ్డి ప్రస్తుత వాతావరణ పరిస్థితులు, వర్షపాతం, సాగు చేయాల్సిన పంటల గురించి వివరించారు. వర్షాధార పంటలైన మొక్కజొన్న, కంది, పత్తి పంటలు, విత్తన సమయాలను వివరించారు. సమావేశంలో పాన్‌గల్ డివిజన్ వ్యవసాయ సంచాలకుడు చంద్రశేఖర్, ఏవో సాజీద్ రెహమాన్, విస్తరణాధికారులు శైలజ, మహేశ్వరి, నరేశ్, అఖిల, నరేశ్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

### హోంగార్డ్ కుటుంబానికి ఆర్థిక సాయం

గద్వాల అర్బన్, జూన్ 25: ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న వారికి అండగా నిలవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ఎస్పీ శ్రీనివాసరావు పేర్కొన్నారు. వివిధ పోలీస్‌స్టేషన్‌లతోపాటు సాయుధదళ కార్యాలయంలో హోంగార్డ్‌గా చంద్రశేఖర్ విధులు నిర్వర్తిస్తూ ఇటీవల మృతిచెందాడు. కుటుంబం పెద్దదిక్కును కోల్పోవడంతో చంద్రశేఖర్ కుటుంబ పరిస్థితి దయనీయంగా మారింది. విషయం తెలుసుకున్న తోటి హోంగార్డ్‌లు రూ.55 వేలు జమచేసి ఎస్పీ చేతుల మీదుగా మంగళవారం పోలీస్ కా ర్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా తోటి హోం గార్డ్ కుటుంబానికి ఆర్థికంగా అండగా నిలిచినందుకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ వెంకటేశ్, సిబ్బంది రామకృష్ణ, రాజశేఖర్, కృష్ణ ఉన్నారు.

### తైబజార్ వసూళ్లు నిలిపి వేయాలి

వనపర్తి, జూన్ 25: పట్టణంలోని మున్సిపాలిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తైబజార్ వసూళ్లు, వేలాన్ని వెంటనే నిలిపి వేయాలని మున్సిపల్ కమిషనర్ పూర్ణచందర్‌కు బీఆర్ఎస్ కౌన్సిలర్లు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నిబంధనలకు విరుద్ధంగా తైబజార్ వేలం నిర్వహిస్తున్నారని, అలాగే పేదలు, చిరు వ్యాపారుల నుంచి తైబజార్ పేరుతో వసూలు చేసే ప్రక్రియ వెంటనే నిలిపి వేయాలని కోరారు. ప్రస్తుతం వేలం నిర్వహించకుండా మున్సిపల్ జవాన్లతో తైబజార్ డబ్బులు వసూలు చేయిస్తూ కొంతమంది ప్రజాప్రతినిధులు, అధికారులు దండుకొంటూ మున్సిపాలిటీకి నష్టం కలిగిస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు కృష్ణ, నాగన్నయాదవ్, కంచెరవి, మాజీ కౌన్సిలర్ తిరుమల్, రహీం పాల్గొన్నారు.

### దరఖాస్తుల ఆహ్వానం

వనపర్తి, జూన్ 25: వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో వివిధ ఖాళీ పోస్టులకు అర్హులైన వారి నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు డీఎంహెచ్‌వో జయచంద్రమోహన్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. వాక్సిన్ కోల్డ్ చైన్ మేనేజర్-1, జిల్లా ప్రోగ్రాం అధికారి-1, టీబీహెచ్‌వీ-1, ఫార్మాసిస్టు-1, స్టాఫ్ నర్సు(MHN/24*7)-4, స్టాఫ్ నర్సు (NCD) -11, స్టాఫ్ నర్సు(UPHC)-2, ఏఎన్ఎం (UPHC) -5 మొత్తం 26 పోస్టులకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. అప్లికేషన్, గైడ్‌లైన్స్ జిల్లా వైద్యారోగ్య శాఖ అధికార వెబ్‌సైట్ wanaparthy.telangana.gov.in నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని పేర్కొన్నారు. పూర్తి చేసి సంబంధిత దరఖాస్తులను జిల్లా వైద్యారోగ్య శాఖ వనపర్తి కార్యాలయంలో ఈనెల 27వ తేదీ నుంచి జూలై 2వ తేదీ మధ్యాహ్నం 3గంటలోగా అందజేయాలని సూచించారు.

### పాముకాటుకు చిన్నారి మృతి

ఖిల్లాఘణపురం, జూన్ 25: పాముకాటుకు చిన్నారి మృతిచెందిన ఘటన మంగళవారం కొత్తపల్లి తండాలో చోటుచేసుకున్నది. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని కొత్తపల్లితండాకు చెందిన రవినాయక్, సుజాత దంపతుల కూతురు హిందు(10) ఇంట్లో నిద్రిస్తుండగా మంగళవారం తెల్లవారుజామున ఇంట్లోకి వచ్చిన కట్ల పాము కాటువేసింది. వెంటనే తల్లి గమనించి వనపర్తి దవాఖానకు తరలించింది. అప్పటికే విషం శరీరమంతా పాకడంతో నోట్లో నుంచి నురగ వచ్చి చిన్నారి మృతిచెందింది. తల్లి సుజాత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు చెప్పారు. పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు చిన్నారి మృతదేహాన్ని అప్పగించినట్లు తెలిపారు.

### ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

అయిజ, జూన్ 25 : పట్టణంలో పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలను అధిక ధరలకు విక్రయిస్తూ తల్లిదండ్రులకు ఆర్థిక ఇబ్బందులు కలిగిస్తున్న ప్రైవేట్ పాఠశాలలపై తగిన చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ నాయకులు ఎంఈవో నర్సింహులును కోరారు. మంగళవారం పట్టణంలోని ఎమ్మార్సీ కార్యాలయం ఆవరణలో నిరసన తెలిపి వినతి పత్రం అందశారు. పాఠ్య పుస్తకాలను అధిక ధరలకు విక్రయిస్తున్న ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు పాల్గొన్నారు.

### కోటిలింగేశ్వర ఆలయంలో పూజలు

కొత్తకోట, జూన్ 25: మండలంలోని కానాయపల్లి స్టేజీ సమీపంలో ఉన్న దత్తకోటిలింగేశ్వర ఆలయంలో మంగళవారం సంటకహరి చతుర్థి సందర్భంగా మహాగణపతి, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. స్వామివారికి భస్మ గంధ కుంకుమ జలాలతో అభిషేకాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో కండక్టర్ శేఖరయ్య, మహేశ్వర్, జగదీశ్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

# మానవత్వం చాటుకున్న గ్రామయువత

- రూ.71వేల ఆర్థికసాయం అందజేత



బాధిత కుటుంబసభ్యులకు నగదు అందజేస్తున్న పుటాన్‌దొడ్డి గ్రామయువత

ఎర్రవల్లి చౌరస్తా, జూన్ 25 : పుటాన్‌దొడ్డి గ్రామయువత అభాగ్యులకు అండగా నిలిచి సేవాగుణాన్ని చాటుకున్నారు. మండలంలోని పుటాన్‌దొడ్డి గ్రామానికి చెందిన బోయ నర్సింహ పెబ్బేరు మండలం కంచిరావుపల్లిలోని స్నేహ కంపెనీలో ఏడాదిగా ఎలక్ట్రీషన్‌గా పనిచేస్తుండేవాడు. నెల రోజుల కిందట విద్యుదాఘాతంతో ఆయన మృతిచెందాడు. విషయం తెలుసుకున్న పుటాన్‌దొడ్డి గ్రామ యువత బాధిత కుటుంబసభ్యులకు మంగళవారం రూ.71వేలు ఆర్థికసాయం అందజేశారు. బోయ నర్సింహకు ఇద్దరు కుమారులు ఉన్నారు. బాధిత కుటుంబాన్ని ఆదుకున్న యువతను గ్రామస్తులు అభినందించారు.

# వ్యక్తిని చంపిన కేసులో ఇద్దరికి జైలు శిక్ష

గద్వాల అర్బన్, జూన్ 25: ఓ వ్యక్తిపై దాడిచేసి చంపిన కేసులో ఇద్దరికి 3ఏండ్ల జైలు శిక్షతోపాటు రూ.5వేలు జరిమానా విధిస్తూ జిల్లా జడ్జి కె.కుషా తీర్పును వెల్లడించారు. వివరాలిలా.. కేటీదొడ్డి మండలంలోని మల్లాపుర్‌కు చెందిన బొజ్జమ్మ భర్త నర్సింహులు(30) గ్రామంలోని 2018లో గ్రామానికి చెందిన వడ్డె చిన్న తిమ్మప్ప, వడ్డె పెద్దతిమ్మప్ప ఘర్షణ పడ్డారు. ఈ ఘర్షణలో ఇద్దరు అన్నదమ్ములు నర్సింహులు గొంతు నులుముతుండగా స్థానికులు విడిపించారు. అప్పటికే అపస్మారకస్థితిలోకి వెళ్లడంతో దవాఖానకు తరలించగా.. మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. తన భర్త మృతికి కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీస్‌లు విచారణ చేపట్టి నిందితులను రిమాండ్‌కు తరలించి పూర్తి విషయాలను పరిశోధించి కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. మంగళవారం ఇరువర్గాల వాదన అనంతరం ఏ1గా వడ్డె చిన్న తిమ్మప్ప, ఏ2గా వడ్డె పెద్ద తిమ్మప్పకు మూడేండ్ల జైలు శిక్షతోపాటు రూ.5వేలు జరిమానా విధించారు. నేరస్తులకు శిక్ష పడేందుకు కృషి చేసిన పోలీసులు రషీద్, ప్రేమ్‌కుమార్, పీపీ వినోదాచారి, ప్రస్తుత పోలీసులను ఎస్పీ శ్రీనివాసరావు అభినందించారు.

# పట్టణ పరిశుభ్రతకు ప్రాధాన్యం



దుర్గానగర్‌లో సమస్యలు తెలుసుకుంటున్న చైర్మన్ దేవన్న

అయిజ, జూన్ 25 : పట్టణ పరిశుభ్రతకు ప్రాధాన్యం కల్పిస్తున్నట్లు మున్సిపల్ చైర్మన్ దేవన్న పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని దుర్గానగర్‌లో చైర్మన్ పర్యటించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వీధి దీపాలు, నల్లా కనెక్షన్లు, శానిటేషన్ తదితర సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని మున్సిపల్ అధికారులకు సూచించారు. మిషన్ భగీరథ పైప్‌లైన్లు లీకేజీ లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. డ్రైనేజీల్లో చెత్తాచెదారం లేకుండా చూడాలన్నారు. డ్రైనేజీలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# డ్రగ్స్‌కు బానిసై జీవితాలను నాశనం చేసుకోవద్దు

ఖిల్లాఘణపుం, జూన్ 25: డ్రగ్స్, మాదక ద్రవ్యాలకు యువత బానిసై తమ జీవితాలను నాశనం చేసుకోవద్దని ఎస్సై శ్రీహరి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని బాలుర హైస్కూల్‌లో విద్యార్థులకు డ్రగ్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. విద్యార్థులు మంచిగా చదివి ఉన్నత స్థానాలకు ఎదిగి సమాజం, తల్లిదండ్రులు, గ్రామానికి మంచిపేరు తీసుకురావాలన్నారు. చదువుతోపాటు క్రీడలతో మానసిక ఉల్లాసం, శారీరక దృఢత్వం, జ్ఞాపకశక్తి పెరుగుతాయన్నారు. యువత చెడు అలవాట్లకు బానిస కాకుండా మంచి నడవడికను అలవర్చుకోవాలన్నారు. అనంతరం డ్రగ్స్, మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కాళిదాస్, ఉపాధ్యాయుడు శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.



ఖిల్లాఘణపురంలో పరీక్ష రాస్తున్న విద్యార్థులు

### గోపాల్‌పేట మండలంలో..

గోపాల్‌పేట, జూన్ 25: మాదకద్రవ్యాలు, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని మండల కేంద్రంలో మంగళవారం నిర్వహించారు. రాష్ట్ర యాంటీ నార్కోటెక్స్ బ్యూరో, పోలీసుశాఖ ఆదేశాల మేరకు స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల, కేజీబీవీలో విద్యార్థులకు మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలు, అక్రమ రవాణా గురించి వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పోటీల్లో ప్రతిభ కనబర్చిన ఝాన్సీ, పుష్పలత, అనురాధకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కేజీబీవీ విద్యాలయం ప్రిన్సిపాల్ దీప్తి, ఉపాధ్యాయులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

### విద్యార్థులు డ్రగ్స్ బారిన పడొద్దు

పెబ్బేరు, జూన్ 25: విద్యార్థులు డ్రగ్స్, గంజాయి వంటి మత్తుపదార్థాల జోలికి వెళ్లి జీవితాలను నాశనం చేసుకోవద్దని పెబ్బేరు ఎస్సై హరిప్రసాద్‌రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక జెడ్పీహెచ్ఎస్‌లో విద్యార్థులతో సమావేశమై దుర్వ్యసనాలపై అవగాహన కల్పించేందుకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలను వివరించారు. కార్యక్రమంలో ఎంఈవో జయరాములు, హెచ్‌ఎం విష్ణువర్ధన్‌రావు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



పెబ్బేరులో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై

# సింగరేణి సంస్థను నిర్వీర్యం చేయొద్దు

- సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జబ్బార్

పెబ్బేరు, జూన్ 25: కేంద్రంలోని బీజేపీ సర్కారు తెలంగాణకు మణిహారమైన సింగరేణి సంస్థను దివాలా తీయించేందుకు కుట్ర పన్నుతున్నదని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జబ్బార్ ఆరోపించారు. మంగళవారం పెబ్బేరులో నిర్వహించిన పార్టీ మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. మోదీ ప్రభుత్వం బొగ్గు బ్లాకుల వేలంతో సంస్థను నిర్వీర్యం చేయడానికి యత్నిస్తుంటే.. కేంద్ర బొగ్గు గనుల సహాయ మంత్రిగా ఉన్న కిషన్‌రెడ్డి మిన్నకుండటం శోచనీయమని విమర్శించారు. వేలంలో రాష్ట్ర ప్రభుత్వం తరపున ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కూడా పాల్గొనడం విడ్డూరమన్నారు. బొగ్గును తవ్వే సంస్థగా సింగరేణికే బొగ్గు బ్లాకులను అప్పగించాలని డిమాండ్ చేశారు. బొగ్గు గనులను సింగరేణికే అప్పగించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి తేవాలని కోరారు. సింగరేణిపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న వైఖరికి నిరసనగా సీపీఎం ఆధ్వర్యంలో ఈనెల 28న జిల్లా కేంద్రాల్లో ధర్నాలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ బాలయ్య, నాయకులు మండ్ల రాజు, పెద్దఖాజా, భాస్కర్, దేవన్న, లక్ష్మన్న, జయరాం పాల్గొన్నారు.

### పోలేరమ్మకు ప్రత్యేక పూజలు

కొత్తకోట, జూన్ 25: పట్టణంలోని బ్రహ్మంగారి ఆలయంలో మంగళవారం పోలేరమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి అభిషేకాలు, అర్చనలు నిర్వహించి తమ మొక్కులను చెల్లించుకున్నారు. ఏటా పోలేరమ్మకు నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించుకోనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆనంద్, విశ్వమోహన్, వెంకటాచారి, వెంకటేశ్, కృష్ణయ్య, మోహన్, ప్రసాద్, విజయ్ తదితరు లు పాల్గొన్నారు.

# ప్రకృతే జీవరాశులకు ప్రాణవాయువు

- సాగర్ స్నేక్ సొసైటీ అధ్యక్షుడు కృష్ణసాగర్
- పెబ్బేరుకు చేరిన 'పర్యావరణ' పాదయాత్ర



పెబ్బేరులో పామును పట్టుకున్న కృష్ణసాగర్

పెబ్బేరు, జూన్ 25: ప్రకృతే జీవరాశులకు ప్రాణవాయువని, చెట్లే మనిషి మనుగడకు మూలాధారమని సాగర్ స్నేక్ సొసైటీ అధ్యక్షుడు కృష్ణసాగర్ అన్నారు. పర్యావరణ పరిరక్షణ, మొక్కల పెంపకంపై అవగాహన కల్పిస్తూ అలంపూర్ నుంచి హైదరాబాద్‌కు ఆయన చేపట్టిన పాదయాత్ర మంగళవారం పెబ్బేరుకు చేరుకున్నది. ఈ సందర్భంగా పలు ఆలయాలు, పోలీస్‌స్టేషన్, పాఠశాలల్లో ఆయన మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువతలో చైతన్యం తీసుకొచ్చి పర్యావరణ పరిరక్షణలో వారిని భాగస్వామ్యం చేసేందుకే తాను పాదయాత్ర చేపట్టినట్లు తెలిపారు. వర్షాలు కురవడం మనిషి చేతిలోనే ఉందని, అందుకే ప్రతిఒక్కరూ మొక్కల పెంపకంపై దృష్టి పెట్టాలని పిలుపునిచ్చారు. పాదయాత్ర జరుగుతుండగానే పట్టణంలోని మాజీ సర్పంచ్ జయశ్రీ ఇంట్లో దూరిన తాచు పామును కృష్ణసాగర్ బృందం పట్టివేసింది. కార్యక్రమంలో స్థానిక నాయకులు, స్నేక్ సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

# బదిలీ ఉద్యోగులకు సన్మానం



ఫార్మాసిస్ట్ పుష్పలతను సన్మానిస్తున్న సిబ్బంది

అలంపూర్, జూన్ 25 : మండలంలోని క్యాతూర్ పీహెచ్‌సీలో ఫార్మాసిస్ట్‌గా విధులు నిర్వర్తించే పుష్పకుమారి గ్రేడ్-1 ఫార్మాసిస్ట్‌గా మహబూబ్‌నగర్‌కు బదిలీపై వెళ్లిన సందర్భంగా మంగళవారం పీహెచ్‌సీలో ఆమెను సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రసూణా రాణి మాట్లాడుతూ 11ఏండ్లుగా పీహెచ్ఎసీ పరిధిలో ఉత్తమ సేవలందిచారని, అందరి మన్ననలు పొందారని కొనియాడారు. అలాగే ఆమెతోపాటు, రెగ్యూలర్ స్టాఫ్ నర్సులుగా సెలెక్ట్ అయిన లలిత, బాలీశ్వరీలను కూడా సన్మానించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.